



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

కొరవడిన ప్రచారం...

- సీజనల్ హాస్టళ్లున్నా కానరాని ఫలితం
- అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం

వలసల నివారణకు ప్రభుత్వం సీజనల్ హాస్టళ్లను ప్రారంభించినా ఫలితం కనిపించడం లేదు. హాస్టళ్లపై అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం కావడంతో చిన్నారులను కూడా తమ వెంట వలసకు తీసుకెళ్తున్నారు...


ఎమ్మిగనూరు మండలం కడివెళ్లలో నడుపుతున్న సీజనల్ హాస్టల్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

దశాబ్దాలుగా జిల్లాలో పెరుగుతున్న వలసలను నివారించడంలో అధికారులు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోకపోవడంతో వలసలు ఆగడం లేదు. తాజాగా వలసల నివారణకు ప్రభుత్వం వలసలున్న ప్రాంతాల్లో సీజనల్ హాస్టళ్లను ప్రారంభించింది. జిల్లా వ్యాప్తంగా 71 సీజనల్ హాస్టళ్లను మంజూరు చేయగా వాటిలో ఐదు హాస్టళ్లు ఇప్పటి వరకూ ప్రారంభానికి నోచలేదు. ఒక హాస్టల్‌ను ప్రారంభించి మళ్లీ బంద్ చేశారు. సీజనల్ హాసళ్ల నిర్వహణ బాధ్యతలను స్వయం సహాయక (పొదుపు) సంఘాల మహిళలకు అప్పగించారు. తల్లిదండ్రులు వలస వెళ్లిన కుటుంబంలో విద్యార్థులను ఆ హాస్టళ్లలో చేర్చుకుని వారికి వసతి సౌకర్యం కల్పించడంతో పాటు ఉదయం, రాత్రి భోజన వసతి కల్పించడం ఈ హాస్టళ్ల ఉద్దేశం. ఒక్కో విద్యార్థికి నెలకు రూ.వెయ్యి చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది. ముందు సొంత



డబ్బులతో హాస్టల్ నడపాల్సి రావడంతో నిర్వహణకు ఎవరూ ముందుకు రాలేదు. దాంతో పాటు పిల్లలతో పాటు వలసకు వెళ్లడంతో పిల్లలు లేక పోవడం వల్ల చాలా ప్రాంతాల్లో హాస్టళ్లను ఏర్పాటు చేయలేదు. కౌతాళం మండలంలో 8 పంచాయతీల నుంచి వలసలు అధికంగా ఉంటాయి. చాలా గ్రామాల్లో చదువుకునే విద్యార్థులు కూడా వలస వెళ్లడంతో మండలం మొత్తంగా కేవలం కౌతాళం మండల కేంద్రంలో మాత్రమే ఒక్క సీజనల్ హాస్టల్‌ను ప్రారంభించారు. అక్కడ 60 మంది విద్యార్థులను గుర్తించగా ఆ స్థాయిలో విద్యార్థులు రావడం లేదు. ఎమ్మిగనూరు మండలంలో కడివెళ్ల, కందనాతి, కొటేగల్, గుడికల్ గ్రామాలకు సీజనల్ హాస్టళ్లను మంజూరు చేయగా ప్రస్తుతం కేవలం కడివెళ్లలో మాత్రం హాస్టల్ నడుస్తోంది. కందనాతిలో కొన్ని రోజులు హాస్టల్ నడిపి గిట్టుబాటు కావడం లేదని ఆపేశారు. కొటేగల్, గుడికల్‌లో నిర్వహణకు ఎవరూ ముందుకు రావడం లేదు. జిల్లా వ్యాప్తంగా ప్రారంభించిన సీజనల్ హాస్టళ్లపైన పూర్తి స్థాయిలో ప్రచారం కల్పించకపోవడంతో విద్యార్థులు ఆశించినంత స్థాయిలో రావడం లేదు.

చాలా మందికి తెలీదు...



మా గ్రామంలో సీజనల్ హాస్టల్ ప్రారంభించినట్లు చాలా మందికి తెలీదు. తెలిసి ఉంటే చదువుకునే విద్యార్థులను వలసకు వారితో పాటు తీసుకెళ్లకుండా హాస్టల్‌లో విడిచి వెళ్లేవారు. మేం కూడా 5 మంది కుటుంబ సభ్యులం వలస వెళ్తాం. మా పిల్లలు బయట కాలేజీల్లో చదువుకుంటున్నారు. పిల్లలకు చదువే ఆస్తి.

- ప్రకాశ్, కడివెళ్ల, ఎమ్మిగనూరు మండలం.

సీజనల్ హాస్టల్ తెరవకపోతే చర్యలు



సీజనల్ హాస్టల్ మంజూరు చేసిన తరువాత ఖచ్చితంగా హాస్టల్‌ను తెరవాలి. అలా తెరవక పోతే వారిపై చర్యలు తీసుకుంటాం. అవసరమైతే నోటీసులు కూడా జారీ చేస్తాం. హాస్టల్‌కు వచ్చేలా విద్యార్థులకు కూడా అవగాహన కల్పించాలి.

- కె.వేణుగోపాల్, ఎస్ఎస్ఎ ఎపిసి.

ఉలిందకొండ కంకర కార్మికులకు పనులు కల్పించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఉలిందకొండలో క్వారీలో పని చేస్తున్న కంకర కార్మికులకు పనులు కల్పించాలని, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కూలిలను పెంచాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్.డి.అంజిబాబు డిమాండ్ చేశారు. గురువారం కంకర కార్మికులకు పనులు కల్పించాలని కోరుతూ లేబర్ కార్యాలయం దగ్గర యూనియన్ గౌరవాధ్యక్షులు మధు అధ్యక్షతన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడారు. కంకర కార్మికులు యాజమాన్యంతో గతంలో చేసుకున్న ఒప్పందం ముగిసిపోయిందని తెలిపారు. కొత్తగా అగ్రిమెంట్ చేసుకోవాలని యాజమానులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని చెప్పారు. యాజమాన్యంతో చర్చలు జరిపి కంకర కార్మికులకు న్యాయం చేయాలని 2న లేబర్ అధికారులకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. అధికారులు ఏమాత్రం స్పందించలేదని, కంకర యజమానులు పనులు బంద్ చేసి దాదాపు 200 కుటుంబాలకు పనులు లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కంకర మిషన్లను ప్రారంభించి వెంటనే కార్మికులకు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే వేతన ఒప్పందం చేసి కార్మికులకు పెరిగిన వేతనాలు చెల్లించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల రోజురోజుకు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయని, దానికి తగ్గట్టు వేతనాలు మాత్రం పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. వేతనాలు పెంచేవరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. అనంతరం లేబర్ అధికారి వినతిపత్రం స్వీకరిస్తూ మంగళవారంలోపు జాయింట్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. **కర్నూలు (హాస్పిటల్)** మండలం ఉలిందకొండ గ్రామంలో కంకర కార్మికులు ర్యాలీ నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి మధు మాట్లాడారు. నాయకులు లింగన్న, రంగన్న, మారన్న, పూలరంగడు, రంగస్వామి, నాగేంద్ర పాల్గొన్నారు.

విపత్తుల నివారణపై దృష్టి

- కర్నూలు ఆర్‌డిఒ హరిప్రసాద్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

సహజ, మానవ నిర్మిత విపత్తులతోపాటు కెమికల్ డిజాస్టర్స్ నివారణపై విపత్తుల సంస్థ దృష్టి సారించిందని కర్నూలు రెవెన్యూ డివిజనల్ అధికారి హరిప్రసాద్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఐ.నారాయణ రెడ్డి తెలిపారు. ఇందు కోసం ముందస్తు అవగాహన కార్యక్రమాలు, జాగ్రత్త చర్యలతో పాటు ప్రణాళికలు రూపొందించడం వల్ల రసాయనిక ప్రమాదాల స్థాయిని తగ్గించుకోవచ్చని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ, జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామంలోని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఫిల్లింగ్ ప్లాంట్‌లో కెమికల్ ఎమర్జెన్సీ మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించారు. ఈ మాక్ ఎక్సర్‌సైజ్‌లో భాగంగా భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఫిల్లింగ్ ప్లాంట్‌లో రసాయనిక ప్రమాదం జరిగితే ఎలా ప్రతిస్పందించి చర్యలు తీసుకుంటారో ప్రత్యక్షంగా చూపించారు. ఫైర్ సిబ్బంది వచ్చి ఫ్యాక్టరీలోని మంటలు ఆర్పడం, ఫ్యాక్టరీ సిబ్బందిని ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు రక్షించడం, స్థానిక ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించడం, మెడికల్ క్యాంపులు నిర్వహించడం, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో క్షతగాత్రులకు వైద్య సేవలు అందించడం వంటి ప్రక్రియలను ప్రత్యక్షంగా చూపించారు. అనంతరం వారు మాట్లాడారు. మాక్ ఎక్సర్‌సైజ్ వల్ల కెమికల్ డిజాస్టర్స్ జగిగినప్పుడు ఏ విధంగా పరిశ్రమల యజమాన్యం, జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా సత్వరం తీసుకోవాల్సిన చర్యలతోపాటు లోటుపాట్ల గురించి అధికారులకు అవగాహన కలుగుతుందని తెలిపారు. అగ్నిమాపక శాఖ అధికారి అవినాష్ జయసింహ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డిపిఎం అనుపమ, కాలుష్య నియంత్రణ అధికారి మునిప్రసాద్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీధర్, ఆర్‌టిఒ రమేష్, పబ్లిక్ హెల్త్ ఇఇ చంద్రమోహన్, విద్యుత్ శాఖ ఇఇ రమేష్, డిఎంహెచ్ఒ రామ గిడ్డయ్య, డిసిహెచ్ఎస్ రాంజీ నాయక్, కల్లూరు తహశీల్దార్ రమేష్ పాల్గొన్నారు.


మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అధికారులు

గ్రౌండ్ ట్రూతింగ్ పనులు పూర్తి చేయాలి

- భూపరిపాలన ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పెండింగ్‌లో ఉన్న గ్రౌండ్ ట్రూతింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని భూపరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం రీసర్వే, భూ హక్కు పత్రాలు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భూపరిపాలన ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ మాట్లాడారు. కొన్ని జిల్లాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాటికి గల కారణాలను సంబంధిత జిల్లా కలెక్టర్లను అడిగి తెలుసుకొని, మార్చి 31లోపు పెండింగ్‌లో ఉన్న గ్రౌండ్ ట్రూతింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వెటరైజేషన్ పనులు, విలేజ్ సర్వేయర్, విఆర్ఒల లాగిన్‌లో డేటా ఎంట్రీస్ కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో డ్రోన్ ఫ్లై చేసే ముందు డ్రోన్ కంట్రోల్ పాయింట్స్ మార్క్ చేసి సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. గ్రౌండ్ ట్రూతింగ్ చేసిన తర్వాత 9(2), 10(2) నోటీసులు ఏమైనా వస్తే వాటిని త్వరితగతిన డిస్పోజ్ చేయాలన్నారు. ఒఆర్ఐ మ్యాప్ వచ్చినప్పటి నుంచి సెక్షన్ 13 నోటిఫికేషన్ ఇవ్వడానికి ఎంత సమయం పడుతుందని అన్ని జిల్లాల కలెక్టర్ల వివరణ కోరగా... 90 రోజుల సమయం పడుతుందని భూ పరిపాలన ప్రధాన కార్యదర్శికి తెలిపారు. కర్నూలు నుంచి కలెక్టర్ పి.కోటేశ్వరరావు, ల్యాండ్స్ అండ్ సర్వే ఎడి పవన్ కుమార్ పాల్గొన్నారు.

మతోన్మాదంపై ఉద్యమం

- ఆవాజ్ నగర గౌరవాధ్యక్షులు ఇస్మాయిల్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కేంద్రంలోని బిజెపి విధానాలకు, మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని ఆవాజ్ నగర కమిటీ గౌరవాధ్యక్షులు ఇస్మాయిల్ పిలుపునిచ్చారు. గురువారం కర్నూలు నగరంలోని జీబీ ఫంక్షన్ హాల్‌లో ఆవాజ్ నూతన కమిటీ సమావేశం అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్మాయిల్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరూ ఏకమై ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నలలో నడుస్తున్న ప్రభుత్వంలో దళితులకు మైనార్టీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. లౌకికవాదులను, ప్రజాస్వామ్యవాదులందరిని, వామపక్షాలను కలుపుకుని మతోన్మాదంపై ఐక్యంగా పోరాడాల్సిన అవశ్యకత ఉందన్నారు. నూతనంగా ఎన్నికైన నగర అధ్యక్షులు ఇక్బాల్ హుస్సేన్ మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యలతో పాటు మైనార్టీల సమస్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పని చేస్తామన్నారు. నగర కార్యదర్శి ఎస్ఎండీ షరీఫ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ పేరుతో ఇస్తున్న స్కాలర్షిప్లను రద్దుచేసి, మైనారిటీలకు ఇచ్చే స్కాలర్షిప్‌లను కొనసాగించాలని, ఒకటి నుండి పదో తరగతి వరకు మైనార్టీ విద్యార్థులందరికీ స్కాలర్షిప్ కచ్చితంగా ఇవ్వాలని, ఉర్దూ యూనివర్సిటీ పట్ల వివక్షతను విడనాడి అభివృద్ధి చేయాలని నగర సమావేశంలో తీర్మానించామని తెలిపారు. ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని, ముస్లిం మైనార్టీలు అధికంగా ఉన్న ప్రాంతాలలో ఉర్దూ మీడియం అంగన్వాడీ సెంటర్లను ఏర్పాటు చేయాలని, ఉర్దూను రెండో భాషగా గుర్తించి, ఉర్దూ ఉపాధ్యాయులను నియమించి నిధులను కేటాయించాలని, షాదీ ముబారక్ దుల్హన్ పథకాన్ని విద్యార్హతతో నిమిత్తం లేకుండా అమలు చేయాలని మహాసభ తీర్మానించిందన్నారు. ముస్లిం మైనార్టీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పారిశ్రామికంగా జిల్లాను అభివద్ధి పథంలో నడిపి, యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించాలని, విద్యా, వైద్యం కోసం బడ్జెట్లో నిధులు పెంచాలని, ముస్లింల జనాభాకు అనుగుణంగా బడ్జెట్లో పది శాతం నిధులు కేటాయించాలని మహాసభ తీర్మానించిందని, రాబోయే కాలంలో ఆవాజ్ కమిటీగా పోరాడి ప్రభుత్వాలపైన ఒత్తిడి తెచ్చి సాధించుకుందాం అని పిలుపునిచ్చారు.





'కర్నూలు- అరుణాచలం'కు సూపర్ లగ్జరీ బస్సు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

భక్తుల సౌకర్యార్థం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, కర్నూలు-2 డిపో తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచల క్షేత్రానికి, గిరి ప్రదక్షిణకు దీపోత్సవానికి మార్చి 5వ తేదీన కర్నూలు నుండి సూపర్ లగ్జరీ బస్సును నడుపుతున్నామని టూ డిపో మేనేజర్ సర్దార్ హుస్సేన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 5న ఆదివారం సాయంత్రం 6 గంటలకు బస్సు బయలుదేరి, అరుణాచలంకు మరుసటి రోజు 6వ తేదీ ఉదయం 4.30 గంటలకు చేరుకుంటుందని, గిరి ప్రదక్షిణ, అరుణాచలేశ్వర స్వామి దర్శనం తర్వాత, అదే రోజు సాయంత్రం 4 గంటలకు బయలుదేరి, 7వ తేది మంగళవారం ఉదయం 6 గంటలకు కర్నూలుకు చేరుకుంటుందని తెలిపారు. అరుణాచల క్షేత్ర దర్శనంకు రాను, పోను సూపర్ లగ్జరీ బస్సులో రూ.2 వేలు ఛార్జిగా నిర్ణయించామని, ఈ సర్వీసుకు (సర్వీసు నెం.93999) అడ్వాన్సు రిజర్వేషన్ సౌకర్యం కలదని, ముందుగా ఆన్‌లైన్‌లో కానీ, బస్టాండులో కానీ, అధీకృత ఏజెంట్ల వద్ద రిజర్వేషన్ చేయించుకొని నచ్చిన సీట్లు పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు అసిస్టెంట్ మేనేజరు (ట్రాఫిక్) 7382871131, డిపో మేనేజరు 99592 25794 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

స్థానిక సంస్థలకు 4 నామినేషన్లు దాఖలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

స్థానిక సంస్థల నియోజకవర్గం ఎన్నికలకు నాలుగు నామినేషన్లు దాఖలు అయ్యాయని రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని సంయుక్త కలెక్టర్ ఛాంబర్‌లో స్థానిక సంస్థల నియోజకవర్గం శాసన మండలికి పోటీ చేసే అభ్యర్థుల నుండి రిటర్నింగ్ అధికారి, సంయుక్త కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి నామినేషన్లు స్వీకరించారు. రిటర్నింగ్ అధికారి ఎస్. రామసుందర్ రెడ్డి మాట్లాడుతూ ఎపి శాసన మండలి కర్నూలు జిల్లాలో స్థానిక సంస్థల నియోజకవర్గం ఎన్నికలకు గురువారం కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాలో నలుగురు అభ్యర్థులు నామినేషన్ వేశారని పేర్కొన్నారు. నామినేషన్ల స్వీకరణ ఈ రోజుతో ముగిసిందన్నారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన ఉంటుందన్నారు. నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ ఈ నెల 27 అని పేర్కొన్నారు

నామినేషన్లు వేసిన అభ్యర్థుల వివరాలు

1. ఏ. మధుసూదన్ (వైసిపి)
2. కుమ్మరి శ్రీనివాసులు (ఇండిపెండెంట్)
3. ఎన్. మోహన్ రెడ్డి (ఇండిపెండెంట్)
4. భూమా వెంకట వేణుగోపాల్ రెడ్డి (ఇండిపెండెంట్)

ఘనంగా హక్ దినోత్సవం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నగరంలోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో గురువారం హక్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉర్దూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఫజలుర్ రహమాన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డాక్టర్ అబ్దుల్ హక్ పేరిట ఉర్దూ యూనివర్సిటీ పేరు పెట్టడం వల్ల ఆయన విద్య అభివృద్ధికి చేసిన కృషిని గుర్తించినట్లు అయ్యిందన్నారు. విద్యార్థులు కష్టపడి విద్యను అభ్యసించి అబ్దుల్ హక్‌ను ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. విద్యార్థులు డాక్టర్ అబ్దుల్ హక్ జీవిత చరిత్ర, ఆయన సేవ కార్యక్రమాలపై పరిశోధన పత్రాలను చదివారు. కార్యక్రమంలో డాక్టర్ జె.ఎండి.షఫీ, ఉర్దూ శాఖ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎస్ఎం హుస్సేనీ, డాక్టర్ అంతుర్ రహీమ్ పాల్గొన్నారు.

పోతుల నాగరాజును గెలిపించండి

- 27వ వార్డు క్రిష్టానగర్‌లో సిఐటియు ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోతుల నాగరాజును గెలిపించాలని సిఐటియు నగర కార్యదర్శి సిహెచ్ సాయి బాబా ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గురువారం కల్లూరు అర్బన్ 27వ వార్డులోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, ఆంధ్ర బ్యాంక్, స్టేట్ బ్యాంక్, కొఆపరేటివ్ బ్యాంక్, ప్రవేట్ పాఠశాలలు, సచివాలయాలు, ఆడిట్ ఆఫీసులలో పట్టభద్రుల ఎమ్మెల్సీ పోతుల నాగరాజును గెలిపించాలని ప్రచారం చేశారు. టేబుల్ కరపత్రం పంపిణీ చేశారు. సిఐటియు నగర కార్యదర్శి సిహెచ్ సాయిబాబా, సిఐటియు చిన్న వ్యాపారులు యం.లక్ష్మయ్య, అక్బర్, దేవేంద్రలు పాల్గొన్నారు.

30వ వార్డులో ఎన్నికల ప్రచారం : పిడిఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజుకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి వేయించి గెలిపించాలని కెవిపిఎస్ న్యూ సిటీ అధ్యక్షులు జి ఏసు, పి గిడ్డయ్య, జి జాన్ పాల్వా కోరారు. శరీన్ నగర్‌లో ఇంటింటి ప్రచారం చేశారు. పోతుల నాగరాజుని గెలిపించి శాసనమండలికి పంపించాలని కోరారు.


పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న సాయిబాబా, లక్ష్మయ్య తదితరులు

అవినాష్‌కు యోగాచార్య అవార్డు

ప్రజాశక్తి - కర్నూలు స్పోర్ట్స్

ఇటీవల బెంగళూరులో జరిగిన 1వ అంతర్జాతీయ యోగా ఫెస్టివల్‌లో కర్నూలు జిల్లాకు చెందిన జిల్లా కార్యదర్శి అవినాష్ శెట్టి 'యోగా చార్య' అవార్డును అందుకున్నారు. కన్నడ ప్రముఖ సినీ నటి రచన, బెంగళూరు ఏసిపి నారాయణ స్వామి, సిఎఫ్ఎ విజయ్ కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఒలంపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర యోగా సంఘం చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డి, న్యాయవాది శ్రీధర్ రెడ్డి, జిల్లా యోగా సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.



అవార్డు అందుకుంటున్న అవినాష్

రక్త దాతలను సత్కరించడం మన బాధ్యత

- అమ్మ హాస్పటల్ అధినేత డాక్టర్ రమేష్

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

తలసేమియా పిల్లలకు అవసరమైనప్పుడల్లా రక్తదానం చేస్తూ ఆదుకుంటున్న రక్తదాతలను సత్కరించడం మన బాధ్యత అని అమ్మ హాస్పిటల్ అధినేత డాక్టర్ రమేష్ అన్నారు. కర్నూలు తలసీమియా పీపుల్ వెల్ఫేర్ సొసైటీ 3వ వార్షికోత్సవం సందర్భంగా సొసైటీ ఆధ్వర్యంలో తలసీమియా బాధిత పిల్లలకు రక్తం దానం చేసిన రక్త దాతలను 'ఉత్తమ తలసీమియా సేవా పురస్కారం-23 అవార్డ్‌లతో గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ఏ రాష్ట్రంలోనూ ఇవ్వని విధంగా మన రాష్ట్ర ప్రభుత్వం తలసీమియా బాధిత పిల్లలకు రూ.10 వేలు పెన్షన్ ఇస్తూ, ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత ట్రీట్మెంట్ ఇస్తున్నందుకు సొసైటీ, తలసేమియా పిల్లల తరుపున ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. డాక్టర్ జోనాథన్ మాట్లాడుతూ ఆదోని డివిజన్‌ను తాను బాధ్యతగా తీసుకొని ప్రతి కాలేజీలో తలసీమియా మీద అవగాహన కలిపిస్తూ, ఒక్కో తలసేమియా బాబుకి ఐదుగురు రక్త దాతలు దత్తతగా తీసుకొని అవసరమైన రక్తం ఏర్పాటు చేసే సిస్టమ్ తయారు చేస్తామన్నారు. కార్యక్రమంలో తలసీమియా సొసైటీ ప్రెసిడెంట్ బి.శ్రీకాంత్, జనరల్ సెక్రెటరీ జి.సురేష్ బాబు, జాయింట్ సెక్రెటరీ జి.మద్దిలేటి, ఈసీ మెంబర్లు మక్బూల్, సుజాత, మద్దమ్మ, రమేష్, ఏడిసి మెంబర్ మెంబర్ గిరిజ, శ్రీలత, శివనాగిరెడ్డి, వైద్యులు గోవింద్ రెడ్డి, నాగరాజు, పారథ సారధి, ఆదోని ఆర్ట్స్ కాలేజ్ లత, జయలక్ష్మి, కెవిఆర్ కాలేజ్ డిసేబుల్డ్ ఎంప్లాయిస్ ప్రెసిడెంట్ కృష్ణుడు, సక్షమ్ సుబ్బారావు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్

సిఎం జగన్‌పై విమర్శలు హాస్యాస్పదం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ముఖ్యమంత్రి జగన్‌పై ప్రతిపక్ష పార్టీలు ఓర్వలేక విమర్శలు చేస్తున్నాయని, ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయలేని స్థితిలో టిడిపి ఉందని, అలాంటి టిడిపి విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని కోడుమూరు ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్ అన్నారు. గురువారం స్టాంటన్‌పురంలోని వైసిపి కార్యాలయంలో ఆయనన విలేకరులతో మాట్లాడారు. సిఎం ఇచ్చిన మాటకు కట్టుబడి అన్ని సామాజిక తరగతులకు సముచిత స్థానం కల్పించారన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. లోకేష్ యువగళం అట్టర్ ఫ్లాప్ కావడంతో చంద్రబాబు మళ్ళీ మీటింగ్ పెడుతున్నారన్నారు. వైఎస్ జగన్ పాలన చూసి తమ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో కర్నూలు ఎంపీపీ వాసు వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపిపి నెహమ్యా, జెడ్పిటిసి ప్రసన్నకుమార్, వ్యవసాయ సహకార సొసైటీ చైర్మన్ అమర్నాథ్ రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మహబూబ్ బాషా, నాయకులు సంపత్, గోపాల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొత్త మెనూను జిల్లా అధికారులు తనిఖీ

ప్రజాశక్తి - సి.బెళగల్

ప్రభుత్వం పాఠశాలలో ప్రవేశ పెట్టిన రాగి జావా కొత్త మెనూను జిల్లా అధికారులు ఏడి శ్యామ్ పాల్, సూపరిండెంట్ రాజశేఖర్‌లు గురువారం పోలకల్ రెగ్యులర్ స్కూల్లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు మధ్యాహ్నం పథకంలో భాగంగా పౌష్టికాహారం నాణ్యతను పెంచిందన్నారు. ప్రతి విద్యార్థికి సక్రమంగా అందేలా దృష్టి సారించాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో మండల పర్యవేక్షకులు ఏపీఎం వెంకటస్వామి, హెచ్‌ఎంలు తిమ్మన్న, కిష్టన్న, సిబ్బంది జనార్దన్, రఘు, రామోజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న ఎడి శ్యామ్ పాల్ తదితరులు

పెట్రోల్ బంకుల్లో ఆకస్మిక తనిఖీలు

- జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజా రఘువీర్

ప్రజాశక్తి - ఆదోని



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో పెట్రోల్ బంకులను తనిఖీలు చేస్తున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజా రఘువీర్ తెలిపారు. గురువారం ఆదోని డివిజన్‌లోని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఆధ్వర్యంలో పెట్రోలు బంకుల తనిఖీలపై తహశీల్దార్లకు శిక్షణ, అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 140 పెట్రోల్ బంకులు ఉండగా ఇప్పటివరకు 25 పెట్రోల్ బంకులను తనిఖీ చేశామన్నారు. ఆదోని పట్టణంలో లక్ష్మి చెన్నకేశవ పెట్రోల్ బంకును తనిఖీ చేసినట్లు తెలిపారు. పెట్రోల్ బంకులో ఉండాల్సిన బాత్‌రూములు, తాగునీరు, ఉచిత గాలి సదుపాయం, కార్బన్ డయాక్సైడ్ సిలిండర్, రిజిస్ట్రేషన్, రికార్డులు, పెట్రోల్, డీజిల్ నాణ్యత, ధరల పట్టికను పరిశీలించినట్లు చెప్పారు. 5 లీటర్ల క్యాన్ ప్రభుత్వం నిర్వహించిన సీల్ రెన్యువల్ చేయకుండా నిబంధనలు ఉల్లంఘించినందుకు రూ.10 వేల జరిమాన విధించినట్లు తెలిపారు. పెట్రోల్ బంకులో ఏదైనా ఫిర్యాదు ఉంటే 1967 కమాండ్ కంట్రోల్ రూమ్, స్థానిక తహశీల్దార్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. పౌరసరఫరాల ఉప తహశీల్దార్ వలీ బాషా, రామాంజినేయులు రెడ్డి, సేల్స్ ఆఫీసర్ శివ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నాగరాజు గెలుపు కోసం ప్రచారం

ప్రజాశక్తి - ఆదోని



ప్రచారం నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు గెలుపు కోసం ఆదోనిలో గురువారం విస్తృత ప్రచారం చేశామని సిఐటియు నాయకులు లక్ష్మణ్ తెలిపారు. కరపత్రాలు పంచుతూ మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని పట్టభద్రులను అభ్యర్థిస్తూ ఉన్నామన్నారు. సిఐటియు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు వీరేష్, శ్రీనివాసులు ఉన్నారు.

సామజిక సేవలో ముందుటాం : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - గోనెగండ్ల



పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

విద్యార్థి, విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటాలతో పాటు సామాజిక సేవలోనూ ముందుంటామని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు వీరన్న తెలిపారు. గురువారం గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 17 మంది పేద విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో పరీక్షలకు ఉపయోగపడే ప్యాడ్లు, పెన్నులను ఉచితంగా అందజేశారు. పాఠశాల ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు అయ్యస్వాములు, యుటిఎఫ్ నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థి సంఘాలు విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే కాక సామాజిక స్పృహలో భాగంగా పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల చదువుకు తమ వంతు తోడ్పాటునందించడం అభినందనీయమని తెలిపారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు ఖాజా, సహాయ కార్యదర్శి సలీం, ఉపాధ్యక్షులు నంది, యుటిఎఫ్ నాయకులు నరసింహ, గుమ్మల బాబు, రామన్, జిక్రియ, బతకన్న, రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ నాయకులు వీరాంజనేయులు, మురళీ, చిరంజీవి, షాహిద్, మోహన్, చత్రపతి, ఉదయ్, సిరాజ్ పాల్గొన్నారు.

నాసో పరీక్షల్లో భాష్యం-2 విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆదోని



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

నేషనల్ అస్ట్రోనోమి అండ్ సైన్స్ ఒలంపియాడ్ నాసో లెవెల్-1లో భాష్యం-2 పాఠశాలకు చెందిన జునైద్, శ్రీకర్, అలీనా ప్రతిభ కనబరచి ర్యాంకులు సాధించారని జడ్ఇఒ అనిల్ కుమార్ తెలిపారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రశంసా పత్రాలు అందజేసి ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థిలో టాలెంట్ ఉంటుందని, దానిని బయటికి తీసేందుకు ఇలాంటి పరీక్షలు దోహదపడతాయని తెలిపారు. కష్టపడి చదివితే ఏదైనా సాధ్యమని చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, తర్ఫీదు ఇచ్చిన ఉపాధ్యాయులను భాష్యం యాజమాన్యం అభినందించారు. డివిజనల్ ఇన్‌ఛార్జీ రవివర్మ, ప్రిన్సిపల్ సదాశివ, వైస్ ప్రిన్సిపల్ అంజి, జడ్‌సిఒ సంగీత, ప్రధానోపాధ్యాయులు వాణి పాల్గొన్నారు.

రోడ్డు అద్వానం...

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- దుమ్ము, ధూళితో ప్రజల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ఆదోని

కాలనీలకు రోడ్లు, తాగునీరు కల్పించాల్సిన పాలకులు నిర్లక్ష్యం చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. సంక్షేమంతో పాటు అభివృద్ధి చేసినప్పుడే ప్రగతి కనపడుతుందని పలువురు పేర్కొంటున్నారు. అభివృద్ధిని మరచి కేవలం సంక్షేమ పథకాలకే ప్రభుత్వం పరిమితం కావడం వల్ల ప్రజలు రోడ్లు, డ్రెయినేజీ సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని విపక్ష పార్టీల నాయకులు చెబుతున్నారు. రోడ్లు, డ్రెయినేజీ సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్న ఘటనలు ఆదోనిలో చోటు చేసుకుంటున్నాయి

రోడ్డు అద్వానం

ఆదోని పట్టణంలోని ఈఎస్ఐ ఆస్పత్రి రైల్వే గేటు నుంచి రైల్వే గూడ్స్ షెడ్ వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. వర్షాకాలంలో చిన్నపాటి వర్షం వచ్చినా నీరు నిలిచి ఆ రహదారి బురదమయం అవుతుంది. ఆ సమయంలో అడుగు తీసి వేయలేని పరిస్థితి అని అటు వైపు వెళ్లేవారు చెబుతున్నారు. ఆ రోడ్డు గుండా సెయింట్ ఆంటోనీ హైస్కూల్‌కు వెళ్లే విద్యార్థులు, క్రాంతి నగర్, రాజా సాహెబ్ నగర్ ప్రాంతాల వాసులు రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డు గుంతలమయంగా ఉండడంతో బైకులు, ఇతర వాహనాల్లో వచ్చేవారు ఎగుడు దిగుడు వల్ల ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉందని వాపోతున్నారు. రైల్వే గూడ్స్ షెడ్ నుంచి పౌర సరఫరాల ద్వారా పేదలకు అందించే బియ్యం, ఫర్టిలైజర్ బస్తాలు దిగుమతి అవుతున్నాయి. అక్కడి నుంచి లారీల ద్వారా పట్టణంలోని గోదాములకు తరలిస్తున్నారు. రోడ్డు గుంతలమయంగా ఉండడంతో లారీలు లోడుతో వెళ్లే సమయంలో ఇరుక్కుని నిలిచిపోతున్న ఘటనలు ఉన్నాయి. రోడ్డు పరిస్థితి అధ్వానంగా ఉందని, కనీసం గుంతలనైనా పూడ్చాలని మున్సిపల్, రైల్వే అధికారులను కోరినా పట్టించుకునే వారే లేరని చెబుతున్నారు. రైల్వే శాఖ పరిధిలో ఉందని, తాము రోడ్డు నిర్మించలేమని మున్సిపల్ అధికారులు తప్పించుకుంటున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ ఆ రోడ్డు బాగోగులు చూసుకోవాలని రైల్వే అధికారులు పేర్కొంటున్నారు. రోడ్డు వెంబడి ముళ్లపొదలు విస్తరించడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని డ్రైవర్లు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు రోడ్డుకు పడిన గుంతలను గ్రావెల్‌తో పూడ్చాలని కోరుతున్నారు.



గుంతలమయమైన రైల్వే గూడ్స్ షెడ్ రోడ్డు

దుమ్ము, దూళితో ఇబ్బందులు పడుతున్నాం

- హనుమంతు, రాజా సాహెబ్ కాలనీవాసి

మట్టి రోడ్డు కావడంతో వాహనాల రాకపోకల వల్ల దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్నాం. బియ్యం, ఎరువుల రవాణా సమయంలో లారీ డ్రైవర్లు పోటీపడి నడుపుతున్నారు. దీనివల్ల లారీలు అదుపు తప్పి ప్రమాదాలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. సమీపంలో ఉన్న ఇళ్లల్లోకి దుమ్ము, ధూళి రావడం వల్ల శ్వాస సంబంధమైన రుగ్మతలతో బాధపడుతున్నాం. అధికారులు సిమెంట్ రోడ్డు నిర్మించి దుమ్ము, ధూళి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి.

మహిళపై పంది దాడి

ప్రజాశక్తి - కోసిగి రూరల్

మహిళపై వరహం (పంది) దాడి చేసిన సంఘటన గురువారం కోసిగిలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... కోసిగి మూడో వార్డులోని చింతలగేరికి చెందిన చింతలగేని లక్ష్మీ పై చేతికి, ముఖంపై దాడి చేసి గాయపరిచింది. చింతలగేని లక్ష్మిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యం అందించారు. గ్రామంలో పందుల బెడద తీవ్రంగా ఉందని పలుమార్లు అధికారులకు వినిపించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు, ప్రజలు తెలిపారు. కోసిగిలో పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, బస్టాండు, దేవాలయాల ఆవరణలో విపరీతమైన పందులు బెడద ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పందులను గ్రామం బయటకు తరలించాలని కోరుతున్నారు.



దాడికి గురైన చింతలగేని లక్ష్మి

రాజకీయాలకు అతీతంగా ఏకం కండి

- ఐక్య వాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మన్న

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వాల్మీకులు రాజకీయాలకు అతీతంగా ఐక్యం కావాలని ఐక్య వాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు బి.లక్ష్మన్న కోరారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 26న కర్నూలు నగరంలోని మౌర్య ఇన్ హోటల్ సమావేశ భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వాల్మీకులను ఎస్టీలో చేర్చడానికి అసెంబ్లీలో పెట్టి పాస్ చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని కోరారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చేటట్లు, బిజెపి అగ్ర నాయకుల సైతం గత ఎన్నికల్లో హామీ ఇచ్చారని చెప్పారు. రౌండ్ టేబుల్ సమావేశంలో అంశాలన్నింటిపై చర్చ, సలహాలు తీసుకుంటారని తెలిపారు. వాల్మీకులు పార్టీలకు అతీతంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు జగ్గాపురం చిన్న ఈరన్న, బచ్చాల రంగన్న, బి.హనుమంతు, అయ్యప్ప పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మన్న



హుండీ పగులగొట్టిన దుండగులు

దేవాలయాల్లో చోరీ

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని రెండు గ్రామాల దేవాలయాల్లో ఒకే రోజు చోరీ జరిగింది. బుధవారం రాత్రి మండలంలోని హాల్వి గ్రామంలో రామకమ్మ దేవాలయంలో హుండీని పగలగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. కుంబాలనూరు గ్రామం వద్ద మారికాంబ దేవాలయంలో చోరీ జరిగిందని గ్రామస్తులు తెలిపారు. ఈ దేవాలయం హుండీలో రూ.5 వేల నుంచి రూ.10 వేలు ఉండవచ్చని తెలిపారు. హాల్వి గ్రామంలోని దేవాలయం హుండీలో రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఉండవచ్చని ఆ గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి మాట్లాడుతూ... విచారణ చేపట్టి చోరీకి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నిబంధనలు అతిక్రమించే ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి

- ఆర్‌పిఎస్ఎఫ్ వినతి

ప్రజాశక్తి - ఆదోని

నిబంధనలు అతిక్రమించే ప్రయివేట్, కార్పొరేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని ఆర్‌పిఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నవీన్ కుమార్, రాష్ట్ర నాయకులు అఫ్రీద్, జిల్లా కార్యదర్శి బాలు డిమాండ్ చేశారు. గురువారం ఆర్‌పిఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ కార్యాలయంలో సబ్ ఆర్డినేట్ మంజునాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పరీక్షలు, స్క్రీనింగ్ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. డివిజన్ పరిధిలోని ఆస్పత్రిలో తనిఖీలు చేపట్టి ప్రజలను ఆదుకోవాలని కోరారు. నాయకులు భీమా, కల్యాణ్, పవన్, అజయ్ పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

- ప్రజాసంఘాల డిమాండ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని ఎంజి పెట్రోల్ బంకు కమిటీ రోడ్డులో విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా ఎల్ఎల్‌సి కెనాల్ స్థలాన్ని ఆక్రమించుకొని నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల నరసన్న, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి బి.ఏసేపు, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి హనీఫ్ కోరారు. గురువారం ప్రజా సంఘాల బృందం స్థలాన్ని పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నీటిపారుదల శాఖ అధికారుల అనుమతి లేకుండా అక్రమంగా ఎల్ఎల్‌సి కెనాల్‌పై కాంక్రీట్‌తో కూడిన శ్లాబు వేసి హోటళ్లు, బంకులు వేసుకున్నారని తెలిపారు. అక్రమంగా వేసుకున్న బంకులను, హోటళ్లను తొలగించి ఎల్ఎల్‌సి స్థలం కబ్జాకు గురి కాకుండా కాపాడాలని డిమాండ్ చేశారు. బీసీ నాయకులు జి.నాగరాజు, పిఎల్‌వై.చిన్ని ప్రసాద్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి ఎం.రవి పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పుణ్యక్షేత్రంలో అంతా.. నా ఇష్టం..!

- దేవాలయ సహాయ కమిషనర్ వాణి తీరు - ఇష్టారాజ్యంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల పెంపు



ప్రజాశక్తి - కౌతాళం

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రాల్లో ఒకటైన శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రం ఒకటి. దేవాలయ సహాయ కమిషనర్ వాణి పనితీరు 'అంతా.. నా ఇష్టం' అనే విధంగా కొనసాగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గురువారం చోటు చేసుకున్న సంఘటన ఇందుకు నిదర్శనంగా నిలిచింది. దేవాలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం పాలకమండలిని నియమించింది. పుణ్యక్షేత్రంలో ఏం చేయాలన్నా అధికారులు పాలకమండలి సమావేశంలో చర్చించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఒప్పంద పద్ధతి కార్మికుల (అవుట్‌సోర్సింగ్) జీతాల పెంపు విషయంలో పాలక మండలి ఛైర్మన్‌ను సంప్రదించకుండానే కొంతమంది జీతాలు పెంచి 'అంతా.. నా ఇష్టం' అనే విధంగా కొనసాగడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. పుణ్యక్షేత్రంలో 48 మంది అవుట్‌సోర్సింగ్ కింద పనులు చేస్తున్నారు. వీరికి ప్రతి నెలా రూ.12,500 వేతనం అందిస్తున్నారు. ఇందులో కొంత మంది జీతాలు రూ.15 వేలకు పెంచడం పట్ల మిగతా కార్మికుల్లో ఆందోళన మొదలైంది. 10, 12 సంవత్సరాల నుంచి పని చేస్తున్న వారికి కాకుండా 4, 5 సంవత్సరాల నుంచి పని చేస్తున్న వారి వేతనాలు పెంచడం ఏమిటని చర్చించుకుంటున్నారు.

అందరికీ న్యాయం చేస్తాం

- సహాయ కమిషనర్ వాణి



కొంతమందికి వేతనాలు పెంచడం పట్ల సహాయ కమిషనర్ వాణి స్పందించారు. బడ్జెట్‌ను దృష్టిలో ఉంచుకొని జీతాలు పెంచుతున్నాం. సీనియర్, జూనియర్‌లు కాకుండా బాగా పని చేసే వారికి ముందుగా వేతనాలు పెంచాం. వచ్చిన తర్వాత మిగిలిన వారందరికీ వేతనాలు పెంచి న్యాయం చేస్తాం.

వేతనాల పెంపు విషయం తెలియదు

- నాగరాజ్ గౌడ్, ట్రస్టు బోర్డు ఛైర్మన్



శ్రీనరసింహ ఉరుకుందరయ్య స్వామి పుణ్యక్షేత్రంలో కొంతమందికి వేతనాలు పెంచిన విషయం తెలియదు. పాలకమండలిలో చర్చించి సీనియార్టీ ప్రకారం అందరికీ న్యాయం జరిగేలా వేతనాలు పెంచితే బాగుంటుంది. ఇలాంటి సొంత నిర్ణయం తీసుకోవడం పట్ల అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో అసంతృప్తి పెరుగుతుంది.



పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షులుగా అరుణ్‌కుమార్

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని తెర్నేకల్ సర్పంచి మొగతాల్ అరుణ్ కుమార్‌ను కర్నూలు జిల్లా పంచాయతీ రాజ్ ఛాంబర్‌కు అధ్యక్షులుగా వైసిపి అధ్యక్షులు, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రకటించారు. గురువారం సర్పంచి అరుణ్ కుమార్ మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా పంచాయతీ రాజ్ ఛాంబర్‌కు అధ్యక్షులుగా ప్రకటించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, తెర్నేకల్ సురేందర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వారి నమ్మకానికి వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తనను గెలిపించిన గ్రామస్తుల రుణం ఎప్పటికీ తీర్చుకోలేనని తెలిపారు.

25లోపు రబీ పంటల నమోదు

- ఎఒ ఆనంద్

ప్రజాశక్తి - చిప్పగిరి



మండలంలోని 16 గ్రామాల్లోనూ రబీ కింద రైతులు సాగు చేసిన ప్రతి పంటనూ ఈనెల 25లోపు ఈ-క్రాపు నమోదు చేసుకోవడానికి చివరి అవకాశం కల్పించినట్లు, ఈ అవకాశం నమోదు చేయించుకొని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎఒ ఆనంద్ రైతులకు సూచించారు. గురువారం చిప్పగిరి వ్యవసాయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులందరూ గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాలకు ఆధార్ కార్డు, 1బి తీసుకెళ్లి ఈ-క్రాపు నమోదు, వేలిముద్ర తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. ప్రభుత్వం అందించే ఆర్థిక ప్రయోజనాలు పొందడానికి అర్హులవుతారని చెప్పారు. ఎఇఒ రమాదేవి పాల్గొన్నారు.

విచ్చలవిడిగా గుట్కా అమ్మకాలు

- గుట్కా కు బానిసలై అనారోగ్యం పాలవుతున్న యువత
- చోద్యం చేస్తున్న సంబంధిత అధికారులు

ప్రజాశక్తి - హొళగుంద

హొళగుంద మండలంలో గుట్కా ప్యాకెట్ల అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. యువకులు గుట్కాకు బానిసలై అనారోగ్యం పాలవుతున్నారు. గుట్కా అమ్మకాలను అరికట్టాల్సిన సంబంధిత అధికారులు చోద్యం చేస్తున్నారని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. ఇక్కడి నుంచి 5 కిలోమీటర్ల దూరంలో కర్ణాటక సరిహద్దు ఉండడంతో అధిక సంఖ్యలో గుట్కా ప్యాకెట్ల రవాణా జరుగుతున్నట్లు సమాచారం. ఇక్కడ ఏ దుకాణానికి వెళ్లినా తాగడానికి నీరు దొరుకుతుందో లేదో తెలియదుగానీ గుట్కా ప్యాకెట్లు మాత్రం దర్శనమిస్తాయి. అధికారులకు తెలిసినా తూతూమంత్రంగా దాడులు నిర్వహించి అక్కడక్కడ 1, 2 కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నట్లు తెలిసింది. గుట్కా ప్యాకెట్ల అమ్మకాల వల్ల వ్యాపారులకు అధిక సంఖ్యలో లాభాలు వచ్చి చేరినా, ఎక్కువ శాతం కార్మికులు, యువకులతో పాటు యువతులు, మధ్యతరగతి మహిళలు సైతం బానిసైనట్లు సమాచారం. నోటి క్యాన్సర్‌తోపాటు రక్తహీనత, మతిస్థిమితం కోల్పోవడం వంటి సమస్యలు వచ్చి చేరుతున్నట్లు వైద్యాధికారి చెబుతున్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచి 30 గుట్కా సీట్లు గల ఒక బాక్స్‌ను రూ.100 ప్రకారం కొనుగోలు చేసి రూ.150 నుంచి రూ.200 వరకు వ్యాపారులు అమ్మి సొమ్ము చేసుకుంటున్నట్లు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. రాష్ట్రాల మధ్య గుట్కా, మత్తు పదార్థాల కార్యకలాపాలపై ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవడంలో తేడాలు ఉండటం వల్ల అమ్మకందారులు చెలరేగిపోతున్నట్లు సమాచారం.



కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి

ఏ రాష్ట్రం కూడా గుట్కా, మత్తు పదార్థాలను అమ్మి లాభాలను ఆర్జించకూడదని కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. పక్కన కర్ణాటక రాష్ట్రంలో గుట్కా ప్యాకెట్లు అమ్ముకోవచ్చని ఆదేశించడం వల్ల బహిరంగంగా మార్కెట్‌లో అమ్మకాలు జరుగుతున్నాయి. ఆంధ్ర రాష్ట్రంలో గుట్కా, మత్తు పదార్థాలు నిషేధించడం వల్ల రహస్యంగా అమ్మకాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుట్కా వ్యాపారులపై ఉక్కు పాదం మోపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అన్ని జాగ్రత్తలూ చేపట్టాలి...

- జడ్‌పిటిసి లింగప్ప

- గూళ్యం సమస్యలపై పర్యటన

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని గూళ్యం గ్రామంలో శ్రీశరణ గాది లింగేశ్వర, శ్రీసిద్ధ లింగేశ్వర జోడు రథోత్సవం రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఘనంగా నిర్వహిస్తారని, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలూ కలుగకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టాలని జడ్‌పిటిసి లింగప్ప ఆయా శాఖల అధికారులను కోరారు. గురువారం అధికారులతో, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భక్తులకు తాగునీరు, భోజనం వసతి, వైద్యం, విద్యుత్, రోడ్డు సమస్యలపై ఆయా శాఖల అధికారులతో సంప్రదింపులు చేశామని తెలిపారు. హాలహర్వి రెవెన్యూ, ఎంపిడిఒ అధికారులు గ్రామంలో పర్యటించి సమస్యలపై స్పందించాలని కోరారు. ఎలాంటి అసౌకర్యాలూ కలుగకుండా ముందస్తు జాగ్రత్తగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని డిఇ, ఎఇలకు తెలిపారు. ఇంత పెద్ద రథోత్సవం జరుగుతున్నా ఆర్అండ్‌బి అధికారులు రోడ్డుకు మరమ్మతులు కూడా చేయించలేదని చెప్పారు. ప్రతేడాది మరమ్మతులతోనే సరిపెడుతున్నారని, ఈఏడాది కూడా నామమాత్రంగానే మరమ్మతులు చేపట్టారని తెలిపారు. ఇక ముందైనా పూర్తిగా కొత్త రోడ్డు నిర్మించాలని కోరారు. బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ బజారప్ప, లక్ష్మణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్‌పిటిసి లింగప్ప



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ మధుసూదన్

జోరందుకున్న నామినేషన్ల పర్వం

- కర్నూలుకు తరలి వెళ్లిన ఎమ్మెల్సీ అభ్యర్థి మధుసూదన్, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్ల పర్వం జోరందుకుంది. గురువారం ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి నాయకులు, మున్సిపల్ ఛైర్మన్ శాంత, మార్కెట్ యార్డు ఛైర్మన్ మహబూబ్ బాషాతో పాటు వైస్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు పెద్ద ఎత్తున కర్నూలుకు తరలి వెళ్లారు. అధికార, ప్రతిపక్ష పార్టీల తరపున బరిలో దిగుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థులు కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేశారు. గురువారం కర్నూలు స్థానిక సంస్థల నియోజకవర్గ వైసిపి అభ్యర్థిగా డాక్టర్ మధుసూదన్ నామినేషన్ దాఖలు చేశారు. కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి, జెసి ఎస్.రామ సుందర్ రెడ్డికి నామినేషన్ పత్రం అందజేశారు. వైసిపి జిల్లా అధ్యక్షులు బివై.రామయ్య ఉన్నారు.



అవార్డును అందుకుంటున్న ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

రాఘవేంద్ర అనుగ్రహ అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో వివిధ రంగాల్లో సేవలు అందించిన ప్రముఖులకు పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు రాఘవేంద్ర అనుగ్రహ అవార్డులను ప్రదానం చేశారు. గురువారం రాఘవేంద్ర స్వామి గురు వైభవోత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీమఠం ఆవరణంలో ఉన్న యోగీంద్ర సభా మండపంలో అవార్డుల ప్రదానోత్సవం ఏర్పాటు చేశారు. రాజకీయ, సినీ రంగంలో, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో సేవలు అందించిన ఉరవకొండ ఎమ్మెల్యే, టిడిపి నాయకులు పయ్యావుల కేశవ్, కన్నడ సినీ నటులు, రాజ్యసభ సభ్యులు జగ్గేష్, కన్నడ సినీ నటి రచితారామ్, కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారికి చెందిన రాఘవేంద్ర అష్టోత్తర సంఘం సభ్యులు, పాణ్యం ఎమ్మెల్యే, టిటిడి ట్రస్టు బోర్డు సభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డికి మెమెంటో‌తో అందజేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు మాట్లాడారు. భక్తుల విరాళాలతో శ్రీమఠం దినదినాభివృద్ధి చెందుతోందని, సామాజిక, రాజకీయ, ఆధ్యాత్మిక, సాంస్కృతిక రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారిని సన్మానిస్తున్నట్లు తెలిపారు. శ్రీమఠం ఎఎఒ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కె.శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతిఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహమూర్తి పాల్గొన్నారు.

టిబి సెంటర్‌ను తనిఖీ చేసిన జిల్లా అధికారి

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని ఏరియా ఆస్పత్రి టిబి సెంటర్‌ను టిబి, లెప్రసీ జిల్లా అధికారి డాక్టర్ భాస్కర్ గురువారం తనిఖీ చేసి డాక్టర్లు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. బ్లడ్ బ్యాంకు, ఎఆర్‌టి (హెచ్ఐవి) సెంటర్‌ను పరిశీలించి హెచ్ఐవి, టిబి రోగులకు అందుతున్న చికిత్సపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్న, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి ద్వారా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఒటిసి డాక్టర్ షేకూన్‌బీ, ఎంపిహెచ్ఎస్ బాబురాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మహారాజ శ్రీ డోన్ సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో

ఐ.పి.నెం.3/2023

మాదిగ రామాంజినేయులు, వయస్సు 42 సం॥లు,
తండ్రి మాదిగ లక్ష్మన్న, హిందూ,
ఇంటి నెం.3-9, రేగులపాడు గ్రామం,
క్రిష్ణగిరి మండలం, కర్నూలు జిల్లా. ...అర్జీదారు

-Vs-

R1 ఎస్.మహబూబ్ బాషా, వయస్సు 52 సం॥లు,
తండ్రి ఎం.మద్దయ్య, ముస్లిం, బిజినెస్,
ఇంటి నెంబరు.76-97-488-19,
పరమళనగర్, కర్నూలు జిల్లా.
R2 కుమ్మరి రుద్రయ్య, తండ్రి మోరిస్వామి,
వయస్సు 42 సం॥లు, హిందూ, బిజినెస్,
రేగులపాడు గ్రామం, క్రిష్ణగిరి మండలం,
కర్నూలు జిల్లా.
R3 కత్తిశీను తండ్రి లేట్ బుద్ద రాముడు,
వయస్సు 39 సం॥లు, ఫైనాన్స్ బిజినెస్, హిందూ,
చుంచు ఎర్రగుడి గ్రామం, క్రిష్ణగిరి మండలం,
కర్నూలు జిల్లా.
R4 యం.లక్ష్మిదేవి భర్త యం.మాదన్న
వయస్సు 45 సం॥లు, హిందూ, బిజినెస్,
రేగులపాడు గ్రామం, క్రిష్ణగిరి మండలం,
కర్నూలు జిల్లా.
R5 యం.క్రిష్ణ తండ్రి యం.బుద్దలక్ష్మన్న,
వయస్సు 35 సం॥లు, బిజినెస్, హిందూ,
రేగులపాడు గ్రామం, క్రిష్ణగిరి మండలం,
కర్నూలు జిల్లా.
R6 సి.సుంకన్న తండ్రి సి.నరసప్ప,
వయస్సు 35 సం॥లు, హిందూ,
చుంచు ఎర్రగుడి గ్రామం, క్రిష్ణగిరి మండలం,
కర్నూలు జిల్లా. ...రెస్పాండెంట్లు 1 to 6

కర్నూలు జిల్లా, కర్నూలు రేగులపాడు, చుంచు ఎర్రగుడి గ్రామ ప్రజలకు తెలియజేయడం ఏమనగా పై నెంబరు ఐపిలో పిటిషనర్ మాదిగ రామాంజనేయులు రేగులపాడు గ్రామం, క్రిష్ణగిరి మండలం, కర్నూలు జిల్లా నందు ఆయనకు అనేక పరియాయములు ప్రమాదం జరిగినందు వలన అలాగే ఆయన ఆరోగ్య పరిస్థితి బాగుగా లేనందువలన తనను దివాలా దారునిగా తీర్మాణం చేయమని కోరుతూ పై కోర్టులో అర్జి దాఖలు (ఐపి పిటిషన్) చేసినాడు. ఇందు పైన ఎవరికైనా ఆక్షేపణలు ఉన్న యెడల 27-02-2023వ తేదిన ఉదయం 10.30 గంటల నిమిషాలకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది : 27-02-2023

లక్ష్మిశెట్టి క్రిష్ణ ప్రసాద్,
అర్జీదారు పరం అడ్వకేట్,
డోన్ , నంద్యాల జిల్లా.
సెల్ : 9985247737